# శుభాకాంక్షల వెల్లువ..



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం నవాబుపేట మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి, మండల నాయకులు విజయ్‌కుమార్, మాణిక్‌రెడ్డి తదితరులు ఉన్నారు. **-నవాబుపేట, జనవరి 3**



మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులతో కలిసి మొక్కను అందజేశారు. సబితారెడ్డికి శుభాకాంక్షలు చెప్పిన వారిలో పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, కౌన్సిలర్ గోపాల్, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, గయాజ్, అశోక్, ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, అనిల్, విజయ్‌కుమార్, మాణిక్‌రెడ్డి , రావూఫ్, వెంకట్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, ప్రవీణ్, సునీల్, రవి, తదితరులు ఉన్నారు. **-వికారాబాద్/నవాబుపేట/మొయినాబాద్, జనవరి 3**



## సావిత్రీబాయి పూలే వేషధారణలో..

- **వికారాబాద్ జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరాహార దీక్షలు**
- **శుక్రవారానికి 29 వ రోజుకు..**

వికారాబాద్, జనవరి 3 : సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారానికి 29వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు వివిధ రీతుల్లో నిరసన తెలుపుతూనే ఉన్నారు. కాగా శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఎస్ఎస్ఏ కేజీబీవీ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి సావిత్రీబాయి పూలే వేషధారణలో దీక్షలో పాల్గొన్నారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్, శేఖర్, రవికుమార్ ,ప్రభావతి, రాజేశ్వరి, స్రవంతి, పల్లవి, రాధిక, సునీత, సోఫియా, స్రవంతి, శైలజ, ఫాతిమ, చంద్రశేఖర్, మోహన్, అనిత, రఘు, రవి, పాండురంగయ్య, అరుంధతి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు

- **రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి**
- **గ్రామాల్లోని సమస్యలు, ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం**



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, జనవరి 3 : గ్రామాల్లోని సమస్యలు, ఉపాధి హామీ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలతో శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ శ్రీలతతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లోని ఉద్యోగుల హాజరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అందరూ సమయపాలన పాటించాలని సూచించారు. అత్యవసర పనులుంటే ఎంపీడీవోలను సమాచారం ఇవ్వాలన్నారు. రోజువారీగా చేపడుతున్న రోడ్లు, పరిసరాల పనులను రిజిస్టర్‌లో క్రమం తప్పకుండా ఎంట్రీ చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని, వీధిదీపాలు, స్తంభాలకు మరమ్మతులుంటే చేయించాలని సూచించారు. గ్రామాల్లోని నర్సరీలు, వైకుంఠధామాలు, కంపోస్ట్ యార్డుల్లో మొక్కలు నాటాలన్నారు. నర్సరీల్లో ప్రత్యేకంగా 10 నుంచి 12 ఫీట్ల వరకు మొక్కలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### జాబ్‌కార్డు ఉన్న వారికి పని కల్పించాలి

గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రతి హబిటేషన్‌ను పరిశీలించి సంక్రాంతి తర్వాత ప్రతి మండలంలోనూ వాటిపై రివ్యూ చేయాలన్నారు. కుటుంబంలో వివాహాలు చేసుకున్న వారికి ఉపాధి హామీ జాబ్‌కార్డులు అందించాలన్నారు. సమావేశంలో జీఎండీఐసీ శ్రీలక్ష్మి, ఎంపీడీవోలు, ఏపీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఇస్తెమాను విజయవంతం చేయాలి

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లిలో నేడు, రేపు నిర్వహించనున్న ఇస్తెమా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే యాదయ్య, స్థానిక అధికారులతో కలిసి శంకర్‌పల్లి పట్టణంలోని అతిథి గ్రౌండ్‌లో పూర్తైన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, మత పెద్దలు, మైనార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..అధికారులు, మత పెద్దలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పార్కింగ్ పక్కాగా ఉండేలా చూడాలన్నారు. ఇస్తెమాకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్, కృష్ణారెడ్డి, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ సురేందర్, ఏసీపీ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబు, ముస్లిం మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌తో అధిక రాబడి

షాబాద్ : ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అస్పల్లిగూడ గ్రామంలో ఉద్యాన వనశాఖ ఆధ్వర్యంలో రైతు యాలాల శ్రీరాంరెడ్డి వ్యవసాయక్షేత్రంలో గ్రంథాలయ సంస్థ రంగారెడ్డి జిలా చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి వారు ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలను ఆర్జించొచ్చునని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు జిల్లాలోని 18 మండలాల్లో ఒకే రోజు 330 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ పంట సాగుతో రైతుకు తక్కువ శ్రమ, ఎక్కువ రాబడి వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే రెండు వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేసినట్లు వివరించారు. రానున్న రెండేండ్లలో జిల్లాలో 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, ఉద్యానవనశాఖ అధికారులు సురేశ్, కిషన్‌రావు, చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు, వాల్యూ ఆయిల్‌పామ్ సీఈవో రామకృష్ణ, జిల్లా కో-ఆర్డినేటర్ ప్రమోద్, డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి కీర్తికృష్ణ, ఎంపీడీవో అపర్ణ, తహసీల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ మధు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏవో వెంకటేశం, ఆర్ఐ విజయ్‌కుమార్, ఏపీవో వీరాసింగ్, గ్రామ రైతులు శ్రీరాంరెడ్డి, రిత్విక్‌రెడ్డి, రాఘవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులు ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్ : రైతులు ఆయిల్‌పామ్‌ను సాగు చేసి అధిక లాభాలు ఆర్జించాలని ఉద్యానవన అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని రాయపోల్ గ్రామంలో రైతు మాధవరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి నవీన, డీసీవో సుధాకర్, తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్ : ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో పాల్గొన్న అరుణ తదితరులు



# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- **వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి**
- **వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**
- **పరిగి, కొడంగల్‌లలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల ఆకస్మిక తనిఖీ**



పరిగి గిరిజన గురుకులంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి/కొడంగల్, జనవరి 3 : వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పరిగిలోని బీసీ బాలుర, గిరిజన బాలికలు, ప్రీ, పోస్టు మెట్రిక్ బాలుర వసతి గృహాలను.. అదే విధంగా కొడంగల్ పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలోని పరిసరాలు, వంటగదులు, వంట సామగ్రిని పరిశీలించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఇచ్చే తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు హెచ్ టూ ఎస్ టెస్ట్ వైల్ ద్వారా పరీక్షించాలని.. వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. కొడంగల్‌లోని బాలికల గురుకులం ఎదుట నిలిచిన మురుగునీటిని త్వరగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ జయరాంనాయక్‌ను ఆదేశించారు. పరిగి తుంకులగడ్డలోని గిరిజన బాలికల గురుకులంలో కలెక్టర్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అదేవిధంగా పరిగి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సముదాయం ఆవరణలో నిర్వహిస్తున్న ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించి..మిర్చీబజ్జీలు తిన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, విజయ్‌కుమార్, వసతిగృహాల సంక్షేమాధికారులు బసప్ప, రవీందర్, శంకర్, భీమరాజ్, వరలక్ష్మి, నారాయణ, శ్రీనివాస్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు

కొడంగల్ : ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు పనులు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కొడంగల్‌లోని కడా కార్యాలయాన్ని సందర్శించి వివిధ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.2 వేల కోట్లు మంజూరు చేసిందని.. రోడ్డు పనులు చేపట్టే క్రమంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాలల అదనపు గదులు, ప్రహరీలు, అంగన్‌వాడీ భవనాల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ ప్రభాకర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ నీలావతి, మిషన్ భగీరథ ఈఈ చెల్మారెడ్డి, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ రాంకుమార్, ఇంజినీరింగ్ విభాగం డీఈ, ఈఈలు పాల్గొన్నారు.



## శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులదే కీలక పాత్ర

**రాష్ట్ర ఇంటెలిజెంట్ డీజీపీ శివధర్‌రెడ్డి**

ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 3 : శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని మూడో బెటాలియన్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న 288 మంది కానిస్టేబుళ్ల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుళ్లకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఐఆర్ఎస్ అధికారి ప్రసాద్, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, మూడోబెటాలియన్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నగల కోసం మహిళ హతం


**పోలీసుల అదుపులో నిందితుడు**

మొయినాబాద్, జనవరి 3 : నగల కోసం ఓ నిందితుడు మహిళను దారుణంగా హత్య చేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన చేగూరి సువర్ణ(49) డిసెంబర్ 27న ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు మొయినాబాద్ ఠాణాలో డిసెంబర్ 28న ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు దర్యాప్తు ప్రారంభించారు.

షాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి (35)కి సువర్ణ(49) హత్యకు రెండు రోజుల ముందే పరిచయమైంది. డిసెంబర్ 27న మల్లారెడ్డి ఫోన్ చేయడంతో ఆమె ఇంట్లో చెప్పకుండా అతడి వద్దకు వెళ్లింది. అదే రోజు సాయంత్రం నిందితుడు ఆమె ఒంటిపై ఉన్న నగలను దోచుకున్నాడు. అత్యాచారం చేసి గొంతు నులిమి హత్య చేసి వాగులో పడేసి పరారయ్యాడు. కాగా చేవెళ్ల మండలంలోని కేసారం గ్రామ గేట్ సమీపంలో పల్గుట్ట గ్రామ రెవెన్యూలో ఓ మృతదేహం ఉన్నట్లు గురువారం సమాచారం అందగా మొయినాబాద్ పోలీసులు అక్కడికెళ్లి పరిశీలించి సువర్ణ మృతదేహంగా తేల్చారు. ఆమె ఫోన్ కాల్ డేటాను పరిశీలించగా మల్లారెడ్డే నిందితుడని గుర్తించి అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. మల్లారెడ్డి షాబాద్‌కు చెందిన ఓ మహిళను హత్య చేసి జైలుకెళ్లి బెయిల్‌పై తిరిగి వచ్చాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

# సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

**విద్యాశాఖ హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి**



ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న విద్యాశాఖ హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి

మొయినాబాద్, జనవరి 3 : విద్యార్థినులు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని బాగా చదువుకోవాలని విద్యాశాఖ హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని కాశీంబౌలి అనుబంధ గ్రామమైన నజీబ్‌నగర్‌లో ఉన్న కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ .. సమాజంలో ఆడపిల్లలకు గౌరవం దక్కాలంటే విద్యాపరంగా జ్ఞానవంతులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారన్నారు. అదేవిధంగా మండలంలోని కనకమామిడిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి వెంకటయ్య ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించి మహిళా టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో కనకమామిడి జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ హైమద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చేవెళ్ల బాలికల గురుకుల పాఠశాలలో..

మండలంలోని తోలుకట్టా గ్రామ సమీపంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో ప్రిన్సిపాల్ మాలతి ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విదేశంలోని అల్లుడిపై పిటిషన్

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : విదేశాల్లో ఉన్న అల్లుడిపై కేసు నమోదు చేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలంటూ హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌కు చెందిన 84 ఏళ్ల వృద్ధుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.అమెరికా కాలిఫోర్నియాలో ఉన్న తన కుమార్తెను అల్లుడు చిత్రహింసలకు గురి చేస్తున్నారని, అల్లుడిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్ కుమార్తె భారత పౌరురాలిగా ఇక్కడి పోలీసుల నుంచి రక్షణ పొందే హక్కు ఉందని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ పిటిషన్ విచారణార్హత ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు.ఏవైనా అభ్యంతరాలంటే అమెరికాలోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. ప్రభుత్వ న్యాయవాది కూడా పిటిషన్ విచారణార్హం కాదనగా న్యాయమూర్తి విచారణను 8కి వాయిదా వేస్తూ విచారణార్హతపై వివరణ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాదికి ఆదేశాలు జారీ చేశారు.

## కాన్సెప్ట్ వన్ డెవలపర్స్..అరాచకం

**ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు మహిళపై దాడి**

బంజారాహిల్స్: ఫ్లాట్ పేరుతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగేందుకు ఆఫీసుకు వచ్చిన మహిళ పట్ల రియల్ ఎస్టేట్ సంస్థ డైరెక్టర్‌తోపాటు మరో వ్యక్తి అసభ్యంగా మాట్లాడడంతోపాటు దాడికి పాల్పడ్డారు. ఫిలింనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ ఓయూ కాలనీలో నివాసముంటున్న మహిళ(36) ఓ ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆరునెలల కిందట ఇన్‌స్టాగ్రామ్ ద్వారా టోలీచౌకి ప్రధాన రహదారిపై ఉన్న కాన్సెప్ట్ వన్ డెవలపర్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ గురించి తెలుసుకుని..నెక్నాంపూర్‌లో ఆ సంస్థ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ బుక్ చేసుకున్నారు. గత ఏడాది ఆగస్టులో అడ్వాన్స్‌గా రూ.8 లక్షలు చెల్లించారు. కాగా.. డిసెంబర్‌లో నెక్నాంపూర్‌లోని తమ ప్రాజెక్టును నిలిపివేశామని, తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తామని సంస్థ ప్రతినిధులు చెప్పారు. మొదట రూ.3 లక్షలు మాత్రమే ఇచ్చి.. ఆ తర్వాత ఫోన్లు ఎత్తడం లేదు. దీంతో గురువారం సాయంత్రం టోలీచౌకిలోని కాన్సెప్ట్ ఓన్ డెవలపర్స్ సంస్థ కార్యాలయానికి భర్తతో కలిసి బాధిత మహిళ వెళ్లి డబ్బులు అడిగారు. అక్కడి ఉద్యోగి అమేశ్ జాబ్రి అసభ్యంగా మాట్లాడాడు. అలాగే సంస్థ డైరెక్టర్ అబ్దుల్ రబ్ బిన్ అబ్దుల్లా కూడా అలాగే మాట్లాడి బాధిత మహిళ చెంపపై కొట్టాడు. దీంతో ఆమె భర్త అడ్డుకోవడానికి ప్రయత్నించగా అతడిపై సైతం దాడి చేశారు. ఈ మేరకు బాధితురాలు శుక్రవారం ఉదయం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంస్థ డైరెక్టర్ అబ్దుల్ రబ్ బిన్ అబ్దుల్లా, అమేశ్ జాబ్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అప్రమత్తంగా ఉండి అడవులను కాపాడాలి



అటవీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి అడవులను కాపాడాలని వికారాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ అటవీ శాఖ కార్యాలయంలో నెలవారీ సమావేశంలో భాగంగా ఉద్యోగులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న పనులు, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. 2025 లో చేపట్టాల్సిన ప్లాంటేషన్, నర్సరీల నిర్వహణ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **-వికారాబాద్, జనవరి 3**